సాక్షి పెద్దపల్లి



I

గురువారం । 2 । అక్టోబర్ । 2025

న్యూస్‌రీల్

ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు



పూజలు చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కమాన్‌పూర్(మంథని): ప్రజలందరికీ దుర్గాదేవి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆకాంక్షించారు. దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని దుర్గామాత సన్నిధిలో మంత్రి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మాజీ ఎంపీటీసీ పిల్లి శేఖర్‌ను మంత్రి పరామర్శించారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులతోపాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్ఎస్ అన్వర్, ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు, పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావుల తదితరులు పాల్గొన్నారు.

దసరా ఏర్పాట్ల పరిశీలన




ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో గురువారం జరిగే దసరా(షమీ) ఏర్పాట్లను పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, ఏసీపీ కృష్ణ, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ బుధవారం పరిశీలించారు. గురువారం సాయంత్రం నిర్వహించే షమీ (జమ్మి చెట్టు) పూజా కార్యక్రమానికి ప్రజలు పెద్దఎత్తున హాజరవుతారని, ఇందుకోసం అన్నిఏర్పాట్లు పూర్తి చేశామని కమిషనర్ వెంకటేశ్ తెలిపారు. అదే విధంగా సాయంత్రం రాంలీలా (రావణవధ) వేడుకలను నిర్వహించనున్నట్లు మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ నూగిల్ల మల్లయ్య తెలిపారు.

అందరికి ప్లాన్-బి!

- బీసీ రిజర్వేషన్లపై పార్టీల మల్లగుల్లాలు
- హైకోర్టు తీర్పు అనంతరమే అభ్యర్థుల ఎంపిక
- అప్పటివరకు ఆశావహుల ప్రతిపాదనలు పక్కకే
- 42, 23 శాతం రెండు జాబితాలు సిద్ధం చేసిన కలెక్టర్ కార్యాలయాలు
- తీర్పు వ్యతిరేకమైతే.. 19 శాతం మేరకు బీసీ స్థానాలపై ప్రభావం
- ఎస్సీ, ఎస్టీ యథాతథం, ఓసీ జనరల్–మహిళలకు పెరగనున్న అవకాశాలు



సాక్షిప్రతినిధి,కరీంనగర్:

బీసీ రిజర్వేషన్ల అంశం విషయంలో ఉత్కంఠ కొనసాగుతోంది. 42 శాతం రిజర్వేషన్లు యథావిధిగా అమలవుతాయా? లేదా కోర్టు తీర్పు ఆధారంగా మారుతాయా? అన్న మీమాంస ప్రతీ రాజకీయ పార్టీని, పోటీ చేసే ఆశావహులను వేధిస్తోంది. అదే సమయంలో అందుకు తగ్గట్లుగా ఇటు ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల కలెక్టర్ కార్యాలయాలు, అటు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ తదితర పార్టీలు, ఆయా పార్టీల అభ్యర్థులు ఎవరికి వారు సిద్ధంగా వారివారి ప్రణాళికలు అమలు చేస్తున్నారు. కోర్టు తీర్పు ఎలా వచ్చినా అందుకు అనుగుణంగా ముందుకు వెళ్లేందుకు ఎవరి వ్యూహాలు వారు రచిస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వ అధికారులు, రాజకీయ పార్టీలు, ఆశావహులు ఎవరికి వారు ప్లాన్–బీని సిద్ధం చేసుకుంటున్నారు.

ప్రత్యామ్నాయ ప్రణాళికలు

స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ.. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇప్పటికిప్పుడు అమలయ్యేది కాదు. దీనికి సవాలక్ష సాంకేతిక, రాజ్యాంగపరమైన చిక్కులు ఎదురవనున్నాయి. ఈ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ కొందరు హైకోర్టును ఆశ్రయించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు అంతా 42 శాతంతో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించారు. అదే సమయంలో కోర్టు తీర్పు వ్యతిరేకంగా వస్తే.. అప్పటికప్పుడు ఇబ్బందులు పడకుండా 23శాతంతోనూ రిజర్వేషన్లతో మరో జాబితా ముందుస్తుగా తమ వద్ద ఉంచుకున్నారు. అదే సమయంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు వస్తున్న ప్రతిపాదనలను ఆయా పార్టీలు పక్కనబెడుతున్నాయి. వాస్తవానికి ప్రతీ పార్టీ ఇప్పటికే స్థానిక సంస్థల్లో 23 శాతం బీసీ రిజర్వేషన్ల ఆధారంగా తమ పార్టీ బలాబలాలపై సర్వేలు చేయించుకున్నాయి. అందుకే, కోర్టు తీర్పు ఆధారంగానే ప్లాన్–ఎ లేదా ప్లాన్–బిని అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. అదే సమయంలో ఆశావహులు కూడా అదే ఆలోచనతో ముందుకు వెళ్తున్నారు. కోర్టు తీర్పు వచ్చేవరకు తొందరపడకుండా.. ఖర్చు విషయంలో ఆచీతూచి వ్యవహరిస్తున్నారు.

ఓసీ అభ్యర్థుల ఆశలు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయాన్ని అన్ని పార్టీలు స్వాగతిస్తున్నా.. కొన్నేళ్లుగా పోటీ చేద్దామని పార్టీకి పనిచేస్తున్న అన్ని పార్టీల నాయకులంతా ఈ నిర్ణయంతో తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. అదే సమయంలో విషయం కోర్టుకు వెళ్లడంతో 23 శాతంతోనే ఎన్నికలు జరుగుతాయని, తాము బరిలోనే ఉంటామని న్యాయస్థానంపై గంపెడాశలతో ఉన్నారు. అదే గనుక వాస్తవరూపం దాల్చితే.. ఏకంగా 19 శాతం మేరకు బీసీ స్థానాలపై ప్రభావం చూపించనుంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మార్పులు వాస్తవ రూపం దాలిస్తే.. ఎస్సీ 15 శాతం, ఎస్టీ ఏడు శాతం రిజర్వేషన్లపై ఎలాంటి ప్రభావం ఉండదు. ఇక ఓసీ జనరల్, ఓసీ మహిళలకు 19 శాతం మేరకు అవకాశాలు పెరగనున్నాయి. జనరల్ కాబట్టి, ఈ వేదికలపై ఎవరైనా పోటీ పడేందుకు విస్తృత అవకాశాలు వస్తాయి. ఏది ఏమైనా కోర్టు తీర్పు కోసం ఇటు కలెక్టర్ కార్యాలయాలు, అటు రాజకీయ పార్టీలు, ఆశావహులు అంతా ప్లాన్–బీతో బరిలోకి దూకేందుకు సిద్ధంగా ఉన్నారు.

జిల్లా ఆస్పత్రిలో ప్రసవాలు భేష్

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో గత సెప్టెంబర్ నెలలో రికార్డుస్థాయిలో 250 ప్రసవాలు జరిగాయని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ఇందుకు కృషి చేసిన వైద్యాధికారులను బుధవారం అభినందించారు. డీఎంహెచ్‌వో వాణిశ్రీ, సూపరింటెండెంట్ శ్రీధర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో 503 ప్రసవాలు జరగ్గా, పెద్దపల్లి మాతాశిశు ఆస్పత్రిలోనే 250 జరిగాయన్నారు. గతంలో సగటు న నెలకు 130 ప్రసవాలు జరిగేవని పేర్కొన్నారు. చంటి పిల్లలకు కూడా ప్రభుత్వ ఆస్పత్రిలోనే వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. గత సెప్టెంబర్‌లో 68 మందికి సేవలు అందించామని అన్నారు.

బాధ్యతలు స్వీకరణ

గ్రూప్ –1 ఆడిట్ అసిస్టెంట్ అధికారిగా ఎంపికైన అఖిల్‌రెడ్డి బుధవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మర్రిగడ్డకు చెందిన అఖిల్‌రెడ్డి.. గ్రూప్–1 పరీక్ష ఫలితాల్లో 176వ ర్యాంక్ సాధించారు. ఆయన కలెక్టర్ శ్రీహర్షను కలిశారు.



కలెక్టర్‌తో ఆడిట్ అసిస్టెంట్ అధికారి అఖిల్‌రెడ్డి

కానిస్టేబుల్ నుంచి ఎంపీడీవోగా..

గోదావరిఖనికి చెందిన చిప్పగణేశ్ 2020 నుంచి కానిస్టేబుల్‌గా పనిచేస్తూనే గ్రూప్ –1 పరీక్షలకు హాజరయ్యారు. ఫలితాల్లో 410వ ర్యాంక్ సాధించి ఎంపీడీవోగా ఎంపికయ్యారు. పట్టుదలతో చదివి ఎంపికై న గణేశ్‌ను కలెక్టర్ బుధవారం తన కార్యాలయంలో అభినందించారు. అలాగే గ్రూప్ –2 ఫలితాల్లో ఏసీటీవోగా ఎంపికైన ఆర్ల సాగర్‌ను కూడా ఆయన అభినందించారు.

రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యం

- అందరూ ఎనిమిది గంటలు పనిచేయాలి
- సింగరేణి ఉద్యోగులకు దసరా శుభాంకాక్షలు
- సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం



మాట్లాడుతున్న సీఎండీ బలరాం

గోదావరిఖని: దసరా పండుగ ఉద్యోగ కుటుంబాల్లో సుఖసంతోషాలు పంచాలని, ఇదేస్ఫూర్తితో నిర్దేశిత 8గంటల పాటు విధినిర్వహణలో పాలుపంచుకోవాలని సింగరేణి సీఎండీ బలరాం ఆకాంక్షించారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనపై కొత్తగూడెం ప్రధాన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఏరియాల అధికారులకు బుధవారం ఆయన దిశానిర్దేశం చేశారు. ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు రోజూ 2.25 లక్షల టన్నులు ఉత్పత్తి సాధించడంతోపాటు రవాణా చేయాలని ఆదేశించారు. రోజూ 14 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగించాలన్నారు. మూడు నెలలుగా కురుస్తున్న భారీవర్షాలతో ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి ఆరునెలల్లో 91 శాతం ఉత్పత్తి, 93 శాతం రవాణా లక్ష్యం సాధించామని, మిగిలిన ఆరు నెలల్లో లక్ష్య సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. సింగరేణి మనుగడ, ఉజ్వల భవిష్యత్‌కు దోహదపడే పలు కీలక నిర్ణయాలు తీసుకున్నామని, ఇందులో భాగంగా కీలక ఖనిజాల అన్వేషణ రంగంలోనూ అడుగు పెట్టామని, బొగ్గు బ్లాకులు, ఇతర ఖనిజాల వేలంలోనూ పాల్గొనేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించిందన్నారు. సింగరేణి అంతర్జాతీయ కార్యాలయం నిర్మాణం కోసం ఫ్యూచర్ సిటీలో 10 ఎకరాల స్థలాన్ని కేటాయించడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, గౌతమ్ పొట్రు, తిరుమలరావు, కోల్ మూమెంట్ ఈడీ బి.వెంకన్న, కో ఆర్డినేషన్ జీఎం టి.శ్రీనివాస్‌తో పాటు అన్ని ఏరియాల జీఎంలు పాల్గొన్నారు.

బిరుదు రాజమల్లు ఆశయ సాధనకు కృషి

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్(పెద్దపల్లి): మాజీఎమ్మెల్యే బిరుదురాజమల్లు ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కోరారు. బిరుదు రాజమల్లు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే బుధవారం పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి బిరుదు రాజమల్లు నిరంతరం శ్రమించారన్నారు. కార్యక్రమంలో రాజమల్లు కుటుంబ సభ్యులు, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ సాయిబాబా, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బిరుదు సమత, కృష్ణ, అనిల్, సంతోష్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అన్నయ్యగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహం నింపాలి



గోదావరిఖని: విజయదశమి (దసరా) పండుగ ప్రజల్లో ఉత్సాహం, ఆనందం నింపాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆకాంక్షించారు. విజయదశమితో కొత్తశకం ప్రారంభం కావాలన్నారు. రామగుండం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు రాజీలేకుండా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

పకడ్బందీగా కోడ్ అమలు

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు.. ఇదేసమయంలో కోడ్ అమలు చేసేందుకూ చర్యలు తీసుకుంటున్నారు. తొలిదశలో పరిషత్, మలిదశలో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారు. జిల్లాలోని 13 జెడ్పీటీసీ, 13 ఎంపీపీతోపాటు 263 గ్రామపంచాయతీల సర్పంచ్ స్థానాలకు పోలింగ్ నిర్వహిస్తారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ కోడ్ అమలులో ఉంటుందని అధికారులు వివరిస్తున్నారు. తద్వారా సంక్షేమ, అభివృద్ధి పనులపై ఆంక్షలు కొనసాగుతాయని అంటున్నారు. మరోవైపు.. తగిన కారణాలు, అనుమతిలేకుండా రూ.50వేలకు మించి రవాణా చేయడం కుదరదని అధికారులు ఇప్పటికే ప్రకటించారు. నిబంధనలు అతిక్రమిస్తే సీజ్ చేస్తామని కూడా హెచ్చరించారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా చెక్‌పోస్టులూ ఏర్పాటు చేస్తున్నారు.

క్లుప్తంగా

హత్యాయత్నం కేసులో అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

గోదావరిఖని: నగరంలోని శ్రీకోదండ రామాలయం సమీప సింగరేణి క్వార్టర్‌లో నివాసం ఉంటూ ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో అవుట్ సోర్సింగ్ అసిస్టెంట్ ఫిజిషియన్‌గా పనిచేస్తున్న ఆర్‌ఎంపీ పరాంకుశం యశ్వంత్‌పై దాడిచేసిన కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందులో స్థానిక విఠల్‌నగర్‌కు చెందిన కన్నం చత్రపతి, అతడి స్నేహితుడు నల్లంగుల ప్రసాద్, రాంనగర్‌కు చెందిన కారు డ్రైవర్ అనవేని సాయితేజ ఉన్నారు. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా, ఏరియా ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిన స్టాఫ్ నర్స్‌గా పనిచేస్తున్న కన్నం సంధ్య పరారీలో ఉందని గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి బుధవారం తెలిపారు.

హైదరాబాద్ టీ-20 మహిళల జట్టుకు శ్రీవల్లి



కరీంనగర్‌స్పోర్ట్స్/ఇల్లంతకుంట(మానకొండూర్): హైదరాబాద్ మహిళల టీ-20 క్రికెట్ జట్టులో కరీంనగర్‌కు చెందిన క్రీడాకారిణి కట్ట శ్రీవల్లి చోటు సంపాదించింది. హైదరాబాద్ సీనియర్ మహిళల టీ-20 క్రికెట్ జట్టును క్రికెట్ సంఘం బాధ్యులు బుధవారం ప్రకటించారు. ఈనెల 8 నుంచి మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో బీసీసీఐ టీ20 టోర్నీ ప్రారంభంకానుంది. టోర్నమెంట్‌లో పాల్గొనే హైదరాబాద్ జట్టులో శ్రీవల్లి చోటు దక్కించుకుంది. శ్రీవల్లి ఎంపికపై కరీంనగర్ జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు ఆగం రావుతోపాటు తల్లిదండ్రులు కట్ట ఉమా - లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శ్రీవల్లి స్వస్థలం రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వంతడుపుల గ్రామం.







మాంసం.. మందులేకుండా పండుగెట్లా?

దసరా పండుగ అంటేనే సుక్క.. ముక్క.. ఇవి లేకుంటే పండుగ కిక్కేముంటుంది.. అసలే సర్పంచ్ ఎన్నికలట.. తాగుడు లేదు.. కోసుడు లేదంటున్నరు.. ముందుగాల్నే తెచ్చుకుందామనుకుంటే.. వైన్స్‌ల ముందు మనోళ్ల బారులు.. నిన్నటిదాకా దసరా పండుగ జల్సాల కోసం ఎంతగానో ఎదురుచూస్తుంటే.. జాతిపిత మహాత్మాగాంధీ పుట్టినరోజు అట.. జీవహింస చేయరాదట.. ఇగ దాహం ఎట్లా తీరేది? ఆకలి తీర్చుకునేది ఎట్లా? అంటున్నారు జిల్లావాసులు. మరోవైపు.. మద్యమంతా గ్రామాల్లోని బెల్ట్‌షాపులకు తరలిపోయిందంటున్నారు. అందుకే కొందరు 'ముందస్తు'బాబులు.. బుధవారం జిల్లా కేంద్రంలోని మద్యం దుకాణాల ఎదుట బారులు తీరి 'సాక్షి' కెమెరాకు ఇలా కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

బీజేపీలో రచ్చకెక్కుతున్న విభేదాలు!

- ఈటలపై హుజూరాబాద్ బీజేపీ శ్రేణుల ఫిర్యాదు
- పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడంటూ రాష్ట్ర అధ్యక్షుడికి ఏకరువు
- ఇతర పార్టీల నుంచి అనుచరులకు టిక్కెట్లు ఇప్పిస్తాననడంపై మండిపడుతున్న నాయకులు



ఈటల రాజేందర్

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

భారతీయ జనతా పార్టీలో విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై స్థానిక పార్టీ శ్రేణులు రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదులు అందజేశారు. గతంలో షామీర్‌పేట్‌లో హుజూరాబాద్ కేడర్‌తో సమావేశం ఏర్పాటు చేసి పార్టీపై పార్టీలో ముఖ్య నాయకులపై ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు అప్పట్లో దుమారం రేపాయి. ఇటీవల హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో లోకల్ బీజేపీ లీడర్లతో సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ టికెట్ రాకుంటే ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి టికెట్ ఇప్పిస్తానని హామీ ఇవ్వండం కలకలం రేపింది. బీజేపీలో ఉంటూ ×మరో పార్టీ టికెట్ ఇప్పిస్తానన్ని ఈటల ఎలా హామీ ఇస్తారంటూ ఈటలపై మండిపడుతున్నారు. కొత్త నేతలు, పాత నాయకులంటూ ఈటల రెండు వర్గాలుగా పార్టీ శ్రేణులను విభజిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పార్టీ నిబంధనలు విస్మరించి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, తన అనుచరులకు ఇతర పార్టీల నుంచైనా టికెట్లు ఇప్పిస్తానని హామీ ఇస్తున్నాడని సీనియర్ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇది బీజేపీనా? లేక ఈటల వ్యక్తిగత దుకాణమా? అని కొంతమంది నాయకులు చర్చించుకుంటున్నారు. ఈటల చర్యలపై అసంతృప్తిగా ఉన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డితో పాటు మరికొంతమంది నాయకులు రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావును కరీంనగర్‌లో కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. హుజూరాబాద్‌లో బీజేపీని బలహీనపరుస్తూ వ్యక్తిగత అనుచరులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. కొంతమంది సీనియర్ నాయకులు కూడా ఈటల వ్యవహరిస్తున్న తీరుపై మండిపడుతున్నారని తెలిసింది. అంతర్గత విభేదాలు ఇలానేన కొనసాగితే రానున్న ఎన్నికలలో ఈటల విధానం పార్టీకి ముప్పు తెస్తుందని బీజేపీ సీనియర్ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతర్గతంగా ఈటలను కట్టడి చేయాలనే డిమాండ్ కూడా పెరుగుతోంది. ఓ వైపు స్థానిక సంస్థల్లో బలం పెంచుకొని రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రావాలని కలలు కంటున్న బీజేపీ, మరోవైపు ఈటల మార్క్ రాజకీయాల వలన ఇబ్బందుల్లో పడుతుందని పేర్కొంటున్నారు. పార్టీలో అంతర్గత విభేదాలతో రానున్న ఎన్నికల్లో బీజేపీకి ప్రతికూల ఫలితాలు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఇక ఈటలపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర నాయకత్వం ఎలాంటి కఠిన నిర్ణయం తీసుకుంటుందో అన్నది రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

నేడు మాంసం విక్రయాలు బంద్

- ఆదేశాలు అతిక్రమిస్తే చర్యలు
- రామగుండం బల్దియా కమిషనర్ అరుణశ్రీ



నోటీసులు అందిస్తున్న కార్పొరేషన్ నాన్‌వెజ్ వెరిఫికేషన్ అధికారి శంకర్

కోల్‌సిటీ(రామగుండం): మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా గురువారం రామగుండం నగరంలో మాంసం విక్రయాలు జరపవద్దని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీ సూచించారు. మహాత్ముడి జయంతి సందర్భంగా జీవహింస చేయరాదన్నారు. ఈ ఆదేశాలు అతిక్రమించే దుకాణదారుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని, చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈమేరకు మాంసం విక్రయాలు జరపకుండా దుకాణాలను మూసి ఉంచాలని ఆదేశిస్తూ బుధవారం నోటీసులు జారీచేసినట్లు తెలిపారు.

మాంసం విక్రయాలు వద్దు

జ్యోతినగర్(రామగుండం): గాంధీ జయంతి సందర్భంగా గురువారం నగరంలో మాంసం దుకాణాలు మూసివేయాలని మున్సిపల్ కార్పొరేషన్ నాన్‌వెజ్ వెరిఫికేషన్ ప్రతినిధి శంకర్ సూచించారు. ఈమేరకు ఎన్టీపీసీలోని రాజీవ్ రహదారి సమీపంలోని మాంసం దుకాణ యజమానులకు బుధవారం నోటీసులను జారీచేశారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా జీవహింస చేయరాదని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. చికెన్, మటన్ విక్రయిస్తే లైసెన్స్‌ల రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు.

దుర్గామాత సన్నిధిలో పూజలు



పూజలు చేస్తున్న పుట్ట మధు

కమాన్‌పూర్(మంథని): దేవీశరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు బుధవారం దుర్గాదేవి మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల్లో ఆయన పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

అలయ్ బలయ్ కార్యక్రమానికి ఆహ్వానం



రాంచందర్‌ను ఆహ్వానిస్తున్న నిర్వాహకులు

జ్యోతినగర్(రామగుండం): గోదావరిఖనిలో ఈనెల 5న నిర్వహించే అలయ్.. బలయ్ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్‌ను ఆహ్వాన సమితి అధ్యక్షుడు బందారి రాజమల్లు కోరారు. ఈమేరకు ఎన్టీపీసీ జ్యోతిభవన్‌లో బుధవారం ఆయనకు ఆహ్వాన పత్రిక అందజేశబూరు. సిరి ఫంక్షన్ హాల్‌లో వేడుకలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రతినిధులు క్యాతం వెంకటరమణ, సబ్బు మల్లయ్య పాల్గొన్నారు.

పెద్దాయనా.. బాగున్నావా..

- రైతును ఆప్యాయంగా పలకరించిన మంత్రి శ్రీధర్‌బాబు



రైతును పలకరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

రామగిరి(మంథని): పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నియోజకవర్గానికి వచ్చిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బుధవారం లద్నాపూర్ గ్రామానికి చేరుకున్నారు. అటుగా వెళ్తున్న రైతులు, వ్యవసాయ కూలీలను చూసి కారు ఆపి వారిని ఆప్యాయంగా పలకరించారు. ఆర్ అండ్ ఆర్ సమస్యను గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి.. సింగరేణి సీఎండీ బలరాంకు ఫోన్ చేసి మాట్లాడారు. లద్నాపూర్ గ్రామస్తుల సమస్య త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. మంత్రి తమ సమస్యను పరిష్కరించాలని స్వయంగా ఫోన్‌చేసి ఆదేశించడంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం సీనియర్ నాయకుడు వనం రాంచందర్‌రావు ఇంట్లో మంత్రి తేనేటి విందు స్వీకరించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రోడ్డ బాపన్న, నాయకులు గంట వెంకటరమణారెడ్డి, పొన్నం సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల పరిశీలన



వివరాలు సేకరిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష, పోలీస్ అధికారులు తదితరులు

పెద్దపల్లిరూరల్/రామగిరి: స్థానిక సంస్థల బ్యాలెట్ బాక్స్‌లు భద్రపర్చేందుకు ఎంపిక చేసిన స్ట్రాంగ్‌రూంలను కలెక్టర్ కోయ శ్రీహర్ష అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, డీసీపీ కరుణాకర్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. స్థానిక మదర్ థెరిసా ఇంజినీరింగ్ కాలేజీలో పెద్దపల్లి సెగ్మెంట్(పెద్దపల్లి, సుల్తానాబాద్, ఎలిగేడు, జూలపల్లి, ఓదెల, కాల్వశ్రీరాంపూర్) పరిధి, రామగిరి మండలం మంథని జేఎన్టీయూలో మంథని నియోజకవర్గంలోని 4 మండలాలు, గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో పాలకుర్తి, అంతర్గాం, ధర్మారం మండలాల బ్యాలెట్ బాక్స్‌లు భద్రపరుస్తామని కలెక్టర్ అన్నారు. మంథని, రామగుండం నియోజకవర్గాల్లోని 7 మండలాలకు ఈనెల 23న, పెద్దపల్లి నియోజకవర్గంలోని 6మండలాలకు ఈనెల 27న ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. జెడ్పీ సీఈవో నరేందర్, ఆర్డీవోలు గంగయ్య, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి

- ఐఏఎస్ అధికారి నరహరి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐఏఎస్ ఆఫీసర్ నరహరి

పాలకుర్తి(రామగుండం): గ్రామీణ కళాకారులను ప్రోత్సహించాలని, తద్వారా వారుఉన్నత స్థాయికి చేరుతారని మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి, ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి అన్నారు. బసంత్‌నగర్‌లో ఈనెల 12వ తేదీన బిట్‌బిట్ డ్యాన్స్ అకాడమీ నిర్వహించే అవార్డుల ప్రదానోత్సవ ప్రచార పోస్టర్‌ను తన స్వగృహంలో బుధవారం ఆవిష్కరించారు. ప్రస్తుతం ఎంతోమంది జానపద, సినీ కళాకారులు గ్రామీణ స్థాయి నుంచి వచ్చినవారేనన్నారు., అలాంటి వారు స్థానికంగా ఉంటే గుర్తించి ప్రోత్సాహం అందించాలని సూచించారు. రామగుండం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పిల్లి రాజమౌళి, మాజీ కార్పొరేటర్ ఐత శివకుమార్, ఆలయ ఫౌండేషన్ ప్రతినిధి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



నేటి నుంచి ప్రైమ్ వాలీబాల్ లీగ్

సాక్షి, హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నేడు హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది. టోర్నీలో మొత్తం 10 జట్లు బరిలోకి దిగుతున్నాయి. నాలుగో సీజన్ పోటీల్లో భాగంగా జరిగే తొలి పోరులో డిఫెండింగ్ చాంపియన్స్ కాలికట్ హీరోస్‌తో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ తలపడుతుంది. మ్యాచ్‌లకు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం వేదిక కాగా, అక్టోబర్ 26న ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తారు. బుధవారం జరిగిన మీడియా సమావేశంలో లీగ్ సహ వ్యవస్థాపకుడు తుహిన్ మిశ్రా, సీఈఓ జాయ్ భట్టాచార్య తదితరులు పాల్గొని టోర్నీ వివరాలను ప్రకటించారు. గత మూడు సీజన్లతో పోలిస్తే ఈసారి లీగ్‌పై అభిమానుల్లో ఆసక్తి పెరిగిందని, టోర్నీని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని వారు వెల్లడించారు. మరోవైపు హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు పీవీఎల్ సీజన్ కోసం కొత్త జెర్సీని రూపొందించింది. తెలంగాణలోని ప్రఖ్యాత పోచంపల్లి ఇక్కత్ డిజైనింగ్ స్ఫూర్తిగా దీనిని తయారు చేసినట్లు టీమ్ యజమాని కంకణాల అభిషేక్ రెడ్డి వెల్లడించారు.



ఆస్ట్రేలియా బోణీ

- యాష్లే గార్డ్‌నర్ సెంచరీ
- 89 పరుగులతో ఓడిన న్యూజిలాండ్

ఇండోర్: మహిళల వన్డే వరల్డ్‌కప్ క్రికెట్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. న్యూజిలాండ్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 89 పరుగుల తేడాతో గెలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 326 పరుగులకు ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' యాష్లే గార్డ్‌నర్ (83 బంతుల్లో 115; 16 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడి సెంచరీ సాధించింది. న్యూజిలాండ్ బౌలర్లలో లీ తహుహు, జెస్ కెర్ 3 వికెట్ల చొప్పున... బ్రీ ఇలింగ్, అమెలియా కెర్ 2 వికెట్ల చొప్పున పడగొట్టారు. 327 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ 43.2 ఓవర్లలో 237 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. కెప్టెన్ సోఫీ డివైన్ (112 బంతుల్లో 111; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు) వీరోచిత సెంచరీ సాధించినా ఫలితం లేకపోయింది. ఆసీస్ బౌలర్లలో సోఫీ, అనాబెల్ 3 వికెట్ల చొప్పున తీశారు. కొలంబోలో నేడు జరిగే మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో పాకిస్తాన్ తలపడుతుంది.

'ట్రోఫీ కావాలంటే వచ్చి తీసుకెళ్లండి'

ఆసియా కప్‌పై నఖ్వీ మంకుపట్టు

దుబాయ్: ఆసియా కప్ విజేతగా నిలిచిన భారత జట్టుకు ట్రోఫీని అందించకుండా అట్టిపెట్టుకున్న ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) చైర్మన్ మొహసిన్ నఖ్వీ మళ్లీ తన దురుద్దేశాన్ని బయటపెట్టాడు. టీమిండియాకు ట్రోఫీ కావాలంటే ఆసియా క్రికెట్ కౌన్సిల్ కార్యాలయానికి వచ్చి తీసుకోవచ్చని, అయితే అప్పుడు కూడా తానే ఇస్తానని అతను తన మొండితనాన్ని ప్రదర్శించాడు. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు చైర్మన్, కేంద్ర మంత్రి కూడా అయిన నఖ్వీ నుంచి తాము ట్రోఫీని అందుకోమని ఫైనల్ తర్వాత స్పష్టం చేసిన భారత జట్టు... కప్ లేకుండానే స్వదేశానికి వెళ్లిపోయింది. దాంతో నఖ్వీపై అన్ని వైపుల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి.

క్లీన్‌స్వీప్‌పై భారత్ గురి

సొంతగడ్డపై టెస్టుల్లో భారత్ దాదాపు 12 ఏళ్ల పాటు ఎదురులేని జట్టుగా ఒక్క సిరీస్ కూడా ఓడిపోకుండా ఆధిపత్యం ప్రదర్శించింది. పర్యటనకు వచ్చిన పెద్ద జట్లు కూడా టీమిండియా జోరును ఆపలేకపోయాయి. అయితే పుష్కర కాలం తర్వాత బలహీనం అనుకున్న న్యూజిలాండ్ పెద్ద దెబ్బ కొట్టింది. గత ఏడాది అనూహ్యంగా కివీస్ చేతిలో భారత్ క్లీన్‌స్వీప్‌నకు గురైంది. ఆ తర్వాత ఇప్పుడు మళ్లీ మన టీమ్ స్వదేశంలో టెస్టు మ్యాచ్ బరిలోకి దిగుతోంది. ఈసారి కూడా బలహీనమైన వెస్టిండీస్ ఎదురుగా ఉంది. ఇంగ్లండ్‌పై చక్కటి ప్రదర్శన తర్వాత ఎలాంటి ఉదాసీనతకు తావు ఇవ్వకుండా ఆడితే విండీస్‌పై పైచేయి ఖాయం. ఈ నేపథ్యంలో రెండు మ్యాచ్‌ల సిరీస్‌కు రంగం సిద్ధమైంది.

- నేటి నుంచి వెస్టిండీస్‌తో తొలి టెస్టు
- జోరు మీదున్న గిల్ బృందం
- సంచలనంపై విండీస్ ఆశలు
- ఉదయం గం. 9:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

అహ్మదాబాద్: శుబ్‌మన్ గిల్ నాయకత్వంలో భారత జట్టు సొంతగడ్డపై తొలి టెస్టు సిరీస్ ఆడనుంది. వెస్టిండీస్‌తో జరిగే రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా నేటి నుంచి మొదటి టెస్టు జరుగుతుంది. సీనియర్లు కోహ్లి, రోహిత్, అశ్విన్‌ల రిటైర్మెంట్ తర్వాత టీమిండియా స్వదేశంలో ఆడనున్న మొదటి టెస్టు ఇదే కానుంది. ఇంగ్లండ్ గడ్డపై అద్భుత ఆటతో సిరీస్‌ను సమం చేసుకున్న టీమిండియా పటిష్టంగా కనిపిస్తోంది. మరోవైపు ఆసీస్‌తో ఆడిన గత టెస్టులో '27 ఆలౌట్' తర్వాత విండీస్ ఇదే మ్యాచ్‌లో బరిలోకి దిగుతోంది. బలాబలాల్లో ఎంతో అంతరం కనిపిస్తుండగా, కరీబియన్ టీమ్ ఇక్కడ ఏమాత్రం పోటీనిస్తుందనేది సందేహమే.

అదనపు పేసర్‌తో...

సాధారణంగా స్వదేశంలో నల్లరేగడి మట్టితో సిద్ధం చేసే స్పిన్ అనుకూల పిచ్‌లపై భారత్ ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈసారి టీమ్ మేనేజ్‌మెంట్ ఉద్దేశపూర్వకంగా పేస్‌కు అనుకూలించే 'ఎర్ర మట్టి' పిచ్‌పై తమ సత్తాను పరీక్షించుకోవాలని భావిస్తోంది. దీని ప్రకారమే తుది జట్టు ఉండవచ్చు. ఇద్దరు ప్రధాన పేసర్లుగా బుమ్రా, సిరాజ్ ఖాయం. స్పిన్ ఆల్‌రౌండర్లుగా జడేజా, సుందర్ ఖాయం. అయితే మూడో స్పిన్నర్ అయిన కుల్దీప్, మరో పేసర్ మధ్య పోటీ ఉండవచ్చు. పిచ్‌ను బట్టి చూస్తే ప్రసిధ్ వైపే మొగ్గు కనిపిస్తోంది. అయితే ఆరో స్థానంలో ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డిని ఆడిస్తే అప్పుడు కుల్దీప్‌కు అవకాశం ఉంటుంది. నితీశ్ జట్టులోకి వస్తే బ్యాటర్ పడిక్కల్‌ను కూడా పక్కన పెట్టాల్సి రావచ్చు. ఇంగ్లండ్‌లో పెద్దగా ఆకట్టుకోకపోయినా నితీశ్‌పై సెలక్టర్లు నమ్మకం ఉంచారు. బ్యాటింగ్‌పరంగా యశస్వి, గిల్, రాహుల్ చక్కటి ఫామ్‌లో ఉండగా సుదర్శన్ కూడా ఇటీవల ఆస్ట్రేలియా 'ఎ'పై సత్తా చాటాడు.



గిల్

అందరూ అంతంతే!

'మా గెలుపుపై ఎవరికీ అంచనాలు లేకపోవడమే మా బలం. ఓటమి భయం లేకుండా స్వేచ్ఛగా ఆడతాం. కివీస్‌ను ఆదర్శంగా తీసుకుంటాం' అని వెస్టిండీస్ కెప్టెన్ రోస్టన్ ఛేజ్ చెబుతున్నాడు. కానీ భారత్‌లో టెస్టులు అంటే ఎంతో కష్టమో విండీస్‌కు బాగా తెలుసు. 1994లో భారత్‌ను ఓడించిన తర్వాత ఇక్కడ ఆడిన 10 టెస్టుల్లో విండీస్ 8 ఓడి, 2 'డ్రా' చేసుకుంది. 2018లో ఆడిన సిరీస్‌లో 2 టెస్టులూ మూడు రోజులకే ముగిశాయి! పట్టుదలగా క్రీజ్‌లో నిలబడి జట్టును నడిపించగల బ్యాటర్ ఎవరూ కనిపించడం లేదు. హోప్, ఛేజ్, వారికన్‌లకు మాత్రమే ఇక్కడ ఆడిన అనుభవం ఉండగా, జేడెన్ సీల్స్ ఇటీవల ఆకట్టుకుంటున్నాడు. ప్రధాన పేసర్లు అల్జారీ జోసెఫ్, షామర్ జోసెఫ్ గాయంతో సిరీస్‌కు దూరం కావడం పెద్ద లోటు. విండీస్ కూడా ముగ్గురు పేసర్లతో ఆడనుంది.



రోస్టన్ ఛేజ్

తుది జట్లు (అంచనా)

భారత్: గిల్ (కెప్టెన్), జైస్వాల్, రాహుల్, సుదర్శన్, జురేల్, నితీశ్ రెడ్డి/పడిక్కల్, జడేజా, సుందర్, బుమ్రా, సిరాజ్, కుల్దీప్/ప్రసిధ్. **వెస్టిండీస్:** ఛేజ్ (కెప్టెన్), చందర్‌పాల్, కెవ్లాన్ అండర్సన్, అతనజె, బ్రెండన్ కింగ్, షై హోప్, గ్రీవ్స్, పైర్, వారికన్, ఫిలిప్ అండర్సన్, సీల్స్.

పిచ్, వాతావరణం

పిచ్‌పై పచ్చికను ఎక్కువగా ఉంచారు. పేస్ బౌలింగ్‌కు అనుకూలం కాగా బ్యాటర్లు పట్టుదల కనబర్చాల్సి ఉంది. నగరంలో అనూహ్యంగా కురుస్తున్న వర్షాలు మ్యాచ్‌కు స్వల్పంగా అంతరాయం కలిగించవచ్చు.

అభిషేక్ అదుర్స్

టి20 ర్యాంకింగ్స్ చరిత్రలో అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన భారత ఓపెనర్



దుబాయ్: ఇటీవల ముగిసిన ఆసియాకప్ టి20 టోర్నమెంట్‌లో దంచికొట్టిన భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మ... అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ర్యాంకింగ్స్‌లోనూ సత్తా చాటాడు. ఈ ఫార్మాట్ చరిత్రలో అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన ప్లేయర్‌గా అభిషేక్ రికార్డు నెలకొల్పాడు. బుధవారం విడుదల చేసిన టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అభిషేక్ 931 రేటింగ్ పాయింట్లతో 'టాప్'లో నిలిచాడు. 2020లో ఇంగ్లండ్ ప్లేయర్ డేవిడ్ మలాన్ 919 రేటింగ్ పాయింట్లు సాధించి రికార్డు సృష్టించగా... ఐదేళ్ల తర్వాత దాన్ని అభిషేక్ సవరించాడు. టీమిండియా తరఫున గతంలో సూర్యకుమార్ యాదవ్ 912 రేటింగ్ పాయింట్లు, విరాట్ కోహ్లి 909 రేటింగ్ పాయింట్లు సాధించగా... ఇప్పుడు అభిషేక్ ఆ ఇద్దరినీ దాటేసి అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకున్నాడు. ప్రస్తుతం ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో ఉన్న ఫిల్ సాల్ట్ (844 పాయింట్లు) కంటే అభిషేక్ 82 రేటింగ్ పాయింట్లు ముందున్నాడు. పాకిస్తాన్‌తో ఆసియా కప్ ఫైనల్లో అజేయ అర్ధశతకంతో జట్టును గెలిపించిన హైదరాబాద్ ప్లేయర్ తిలక్ వర్మ (819 పాయింట్లు) మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. భారత టి20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (698 పాయింట్లు) రెండు స్థానాలు కోల్పోయి 8వ ర్యాంక్‌లో ఉన్నాడు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో భారత స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (803 పాయింట్లు) అగ్రస్థానంలో కొనసాగుతుండగా... ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో హార్దిక్ పాండ్యా (233 పాయింట్లు) 'టాప్' ర్యాంక్ నుంచి రెండో స్థానానికి చేరగా... పాకిస్తాన్ ప్లేయర్ సయీమ్ అయూబ్ (241 పాయింట్లు) నాలుగు ర్యాంక్‌లు మెరుగుపరుచుకొని అగ్రస్థానం దక్కించుకున్నాడు. ఆసియాకప్‌లో బ్యాట్‌తో ఆకట్టుకోలేకపోయిన అయూబ్ బంతితో 8 వికెట్లు తీశాడు.

ముకేశ్‌కు పసిడి పతకం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్‌ఎస్‌ఎఫ్) జూనియర్ ప్రపంచకప్ టోర్నీని భారత్ 'టాప్' ర్యాంక్‌తో ముగించింది. చివరిరోజు బుధవారం భారత్‌కు మూడు పతకాలు లభించాయి. జూనియర్ పురుషుల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్రప్రదేశ్ షూటర్ ముకేశ్ నేలవల్లి స్వర్ణ పతకాన్ని సాధించాడు. గుంటూరు జిల్లాకు చెందిన ముకేశ్ 585 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. భారత్‌కే చెందిన సాహిల్ 573 పాయింట్లతో కాంస్య పతకాన్ని గెల్చుకున్నాడు. ఈ టోర్నీలో ముకేశ్‌కిది రెండో పతకం. అంతకుముందు ముకేశ్ 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో రజతం గెలిచాడు. జూనియర్ మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్ ఫైనల్లో భారత షూటర్ తేజస్విని 30 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించింది. ఓవరాల్‌గా భారత్ 8 స్వర్ణాలు, 10 రజతాలు, 8 కాంస్యాలతో కలిపి మొత్తం 26 పతకాలతో 'టాప్' ర్యాంక్‌లో నిలిచింది.



మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ఫ్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా


శశిరేఖ పరిచయం

చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు'. 'పండగకి వస్తున్నారు' అన్నది ట్యాగ్ లైన్. 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఈ సినిమా 2026 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదిలా ఉంటే... ఈ చిత్రంలో నయనతార చేస్తున్న శశిరేఖ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్.
ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమెరా: సమీర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. కృష్ణ, లైన్ ప్రొడ్యూసర్: నవీన్ గారపాటి.



నయనతార

మాస్ జాతర ఫిక్స్



రవితేజ

రవితేజ హీరోగా నటించిన 'మాస్ జాతర' చిత్రం కొత్త విడుదల తేదీ ఖరారు అయింది. ఈ నెల 31న ఈ చిత్రం విడుదల కానుంది. రవితేజ నటించిన 75వ చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు దర్శకత్వం వహించారు. 'ధమాకా' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత రవితేజ–శ్రీలీల రెండోసారి జోడీగా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. పలుమార్లు విడుదల వాయిదా పడ్డ ఈ చిత్రాన్ని ఈ నెల 31 విడుదల చేయనున్నట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ''వింటేజ్ వైబ్స్, పక్కా కమర్షియల్ అంశాలతో రూపొందిన చిత్రం 'మాస్ జాతర'. మాస్ ప్రేక్షకులతో పాటు కుటుంబ ప్రేక్షకులు కూడా మెచ్చే విధంగా వాణిజ్య అంశాలతో అసలైన పండగ సినిమాలా ఈ చిత్రాన్ని తీశారు భాను భోగవరపు. రవితేజను ఎలా చూడాలని అభిమానులు, ప్రేక్షకులు కోరుకుంటారో అందుకు తగ్గట్టుగానే అందరూ మెచ్చేలా మాస్ రాజాను తెరపై చూపించారాయన. మా సినిమా థియేటర్లలో అసలు సిసలైన మాస్ పండగను తీసుకురాబోతోంది'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: విధు అయ్యన్న, సంగీతం: భీమ్స్.

ఓజీ విజయం నా ఒక్కడిది కాదు - పవన్ కల్యాణ్

''ఓజీ' సినిమా విజయం నా ఒక్కడిది కాదు.. ఇందుకు కారణమైన మా టీమ్‌కి ధన్యవాదాలు'' అని పవన్ కల్యాణ్ చెప్పారు. ఆయన హీరోగా, ప్రియాంక మోహన్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'ఓజీ'. సుజీత్ దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన ఈ సినిమా సెప్టెంబరు 25న రిలీజ్ అయ్యింది. హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఓజీ బ్లాక్‌బస్టర్ సెలబ్రేషన్స్'లో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ– ''ఓ మూవీ ఫెయిల్యూర్‌కి నేనెప్పుడూ భయపడలేదు. ఇటీవల విడుదలైన 'హరి హర వీరమల్లు' సినిమాకి కూడా. నేను చాలా సార్లు ఫెయిల్ అయింది టీమ్ వర్క్ లేకే తప్ప నా ఎఫర్ట్స్ ఎప్పుడూ తగ్గవు. నాకు అన్నం పెట్టిన తల్లి సినిమా. ఈ రోజు ఉప ముఖ్యమంత్రిగా నేనున్నానంటే అది సినిమా ఇచ్చిందే. ఓడిపోతే నిస్సహాయత ఎలా ఉంటుందో తెలుసు.. సినిమా అపజయమైతే ఆ నిస్సహాయత ఎలా ఉంటుందో తెలుసు. సినిమా బాగున్నప్పుడు అందరూ ఉంటారు కానీ, బాగాలేనప్పుడు మన దగ్గర ఎవరు నిలబడతారో వాళ్లే మనవాళ్లు. నేనెప్పుడూ ఫెయిల్యూర్‌ని ఎదుగుదలకు ఒక మెట్టుగా చూస్తానే తప్ప అవరోధంగా చూడను. నేను సినిమా కంటే పెద్దది చేస్తున్నాను.. అదే రాజకీయం. చాలా కష్టమైన పని. సినిమాల్లో విలన్స్‌తో గొడవ పడటం ఈజీ. నిజ జీవితంలో అలా ఉండదు.. తల ఎగిరిపోవచ్చు కూడా. అది నాకు ఎక్స్‌ట్రా రిస్క్. కానీ, దేశంపై నాకు పిచ్చి ప్రేమ ఉంది. అందరి హీరోల సినిమాలు చూస్తాను. ప్రతి హీరో కష్టాన్ని నేను అభినందిస్తాను. అందరి హీరోల అభిమానులను నేను కోరుకునేది ఒక్కటే. ఫ్యాన్ వాయిస్‌ని ఆపేయండి.. అలాంటి స్లోగన్స్‌తో దయచేసి సినిమాని చంపేయకండి. ఇప్పుడు ఓ సినిమా జీవితం అనేది కేవలం ఆరు రోజులు అయిపోయింది. నిర్మాతలు సినిమాలు చేసేందుకు ముందుకు రాకపోతే ఎంతోమంది ఉపాధి కోల్పోతారు'' అన్నారు.



సుజీత్, పవన్ కల్యాణ్, డీవీవీ దానయ్య, తమన్



సోనాక్షీ సిన్హా

సుధీర్ బాబు, సోనాక్షీ సిన్హా లీడ్ రోల్స్‌లో నటించిన సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ 'జటాధర'. ఈ పాన్–ఇండియా ద్విభాషా (తెలుగు, హిందీ) చిత్రానికి వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో ధన పిశాచిగా కనిపిస్తారు సోనాక్షీ సిన్హా. ఈ పాత్రకు సంబంధించిన 'ధన పిశాచి...' పాటను విడుదల చేశారు. సమీరా కొప్పికర్ స్వరపరచిన ఈ పాటకు శ్రీ హర్ష ఈమని సాహిత్యం అందించగా, సాహితీ చాగంటి ఆలపించారు. దివ్య ఖోస్లా, శిల్పా శిరోద్కర్ తదితరులు నటించిన ఈ చిత్రాన్ని జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పణలో ఉమేష్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, శిల్పా సింఘాల్, నిఖిల్ నందా నిర్మించారు. నవంబరు 7న హిందీ, తెలుగు భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.

నిశ్చితార్థానికి వేళాయె



అల్లు శిరీష్

ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తనయుడు, హీరో అల్లు శిరీష్ త్వరలో పెళ్లి పీటలు ఎక్కనున్నారు. ఈ నెల 31న నయనికతో తన నిశ్చితార్థం జరగనున్నట్టు బుధవారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు శిరీష్. కాబోయే భార్యతో ఈఫిల్ టవర్ వద్ద దిగిన ఓ ఫొటోను (చేతులు మాత్రమే కనిపించేలా) పంచుకున్నారు. ''మా తాత అల్లు రామలింగయ్య జయంతి (అక్టోబరు 1) సందర్భంగా నా మనసుకు దగ్గరైన ఒక విషయాన్ని అందరితో పంచుకుంటున్నాను. నేను, నయనిక ఈ నెల 31న నిశ్చితార్థం చేసుకోబోతున్నాం. ఇటీవల కన్నుమూసిన మా నానమ్మ కనకరత్నంగారు ఎప్పుడూ నేను పెళ్లి చేసుకోవాలని కోరుకునేవారు. ఇప్పుడు ఆమె మా మధ్య లేకపోయినప్పటికీ మమ్మల్ని ఆమె ఆశీర్వదిస్తారని నమ్ముతున్నాను'' అంటూ పోస్ట్ చేశారు. నయనిక హైదరాబాద్‌కు చెందిన అమ్మాయి అని టాక్. అయితే ఆమె గురించి పూర్తి వివరాలు మాత్రం తెలియాల్సి ఉంది.

సరికొత్త విలయ తాండవం



ఆకాశ్ పూరి, కార్తీక్ రాజు

కార్తీక్ రాజు, పార్వతి అరుణ్, 'పుష్ప' మూవీ ఫేమ్ జగదీష్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'విలయ తాండవం'. వీఎస్ వాసు దర్శకత్వంలో జీఎంఆర్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై మందల ధర్మారావు, గుంపు భాస్కరరావు నిర్మించారు. దసరాని పురస్కరించుకుని ఈ సినిమా టైటిల్ పోస్టర్ లాంచ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హీరో ఆకాశ్ పూరి, డైరెక్టర్ భీమనేని శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఆకాశ్ పూరి మాట్లాడుతూ– ''విలయ తాండవం' టైటిల్ ఎంతో పవర్‌ఫుల్‌గా ఉంది. టైటిల్ పోస్టర్ చూస్తుంటే గూస్ బంప్స్ వస్తున్నాయి'' అన్నారు. ''నేను తీసిన 'కౌసల్యా కృష్ణమూర్తి' చిత్రంలో కార్తీక్ నటించాడు. 'విలయ తాండవం'తో తనకి మరో హిట్ రావాలి'' అన్నారు భీమనేని శ్రీనివాసరావు. ''సరికొత్త పాయింట్, కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు డైరెక్టర్ వాసు'' అని కార్తీక్ రాజు చెప్పారు. ''అద్భుతమైన కథతో ఈ సినిమా తీశాం'' అన్నారు మందల ధర్మా రావు, గుంపు భాస్కర రావు, వీఎస్ వాసు.

వేట షురూ



గుణి, తరుణ్ భాస్కర్, వేణు

టీను ఆనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్, అక్షయ్ లగుసాని, విష్ణు, కార్తికేయ, విస్మయశ్రీ, మాళవి ప్రధాన పాత్రల్లో రూపొందనున్న చిత్రం 'బా బా బ్లాక్ షీప్'. గుణి మంచికంటి దర్శకత్వంలో దోణెపూడి చక్రపాణి సమర్పణలో చిత్రాలయం స్టూడియోపై వేణు దోణెపూడి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన కథ, కాన్సెప్ట్‌ను పరిచయం చేస్తూ ఓ మోషన్ పోస్టర్‌ను డైరెక్టర్ తరుణ్ భాస్కర్ చేతుల మీదుగా రిలీజ్ చేయించారు. ''గన్స్, గోల్డ్ చుట్టూ జరిగే వేట.. ముగ్గురి తెలివితేటలు... ఒక రోజులో జరిగే ఘటనలు... ఓ ఆరుగురి ప్రయాణంతో న్యూ ఏజ్ క్రైమ్ కామెడీగా ఈ చిత్రం రాబోతోంది'' అని యూనిట్ పేర్కొంది.

టీజర్ చాలా బాగుంది - అనిల్ రావిపూడి

''మటన్ సూప్' టైటిల్ బాగుంది. టీజర్ చాలా బాగుంది. దర్శకుడు రామచంద్ర, హీరో రమణ్, చిత్రయూనిట్‌కి అభినందనలు. ఈ నెల 10న రాబోతున్న ఈ చిత్రాన్ని అందరూ చూసి, పెద్ద విజయం అందించాలి'' అని డైరెక్టర్ అనిల్ రావిపూడి తెలిపారు. రమణ్, వర్ష విశ్వనాథ్ జంటగా రామచంద్ర వట్టికూటి దర్శకత్వం వహించిన చిత్రం 'మటన్ సూప్'. రామకృష్ణ వట్టికూటి సమర్పణలో అలుక్కా స్టూడియోస్, శ్రీ వారాహి ఆర్ట్స్, భవిష్య విహార్ చిత్రాలు బ్యానర్లపై మల్లికార్జున ఎలికా (గోపాల్), అరుణ్ చంద్ర వట్టికూటి, రామకృష్ణ సనపల నిర్మించారు. ఈ నెల 10న ఈ చిత్రం విడుదల కానుంది. బుధవారం ఈ సినిమా టీజర్‌ను అనిల్ రావిపూడి రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా రామచంద్ర వట్టికూటి మాట్లాడుతూ– ''మా సినిమాని అందరూ పెద్ద హిట్ చేయాలి'' అని కోరారు. ''మంచి స్క్రీన్‌ప్లేతో మా చిత్రం రాబోతోంది'' అన్నారు మల్లికార్జున ఎలికా. ''నేటి ట్రెండ్‌కు తగ్గ కథ ఇది'' అని రామకృష్ణ సనపల, అరుణ్ చంద్ర వట్టికూటి చెప్పారు. ''మా దర్శక, నిర్మాతలు ఎంతో కష్టపడి ఈ సినిమా రూపొందించారు'' అన్నారు రమణ్.



గోపాల్, రామచంద్ర, అనిల్ రావిపూడి, రమణ్

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



విరాజ్, యశశ్రీ రావు

విరాజ్ అశ్విన్, ప్రియదర్శిని రామ్, బాబూ మోహన్, యశశ్రీ రావు, పవన్ సిద్ధు, టీస్టీ తేజ, సూర్య గోపీనాథ్, శివన్నారాయణ ముఖ్య తారలుగా కొత్త సినిమాకి కొబ్బరి కాయ కొట్టారు. వినోద్ గాలి రచన, దర్శకత్వంలో ఈటీవీ విన్‌తో కలిసి 90స్ కిడ్స్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై శరత్ చంద్ర నాయుడు నిర్మిస్తున్న ఈ చిత్రం బుధవారం ఆరంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత రవిశంకర్ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు హరీష్ శంకర్ క్లాప్ కొట్టగా, నిర్మాత ఎస్‌కేఎన్ దర్శకత్వం వహించారు. నిర్మాత బన్నీ వాసు, డైరెక్టర్ మెహర్ రమేష్, ప్రసాద్ నిమ్మకాలయ, నిఖిల కోనేరు తదితరులు అతిథులుగా హాజరై, యూనిట్‌కి అభినందనలు తెలిపారు. ''బలమైన భావోద్వేగాలతో కూడిన బడ్డీ కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: రెహాన్ షేక్, సంగీతం: సుహాస్.